క్లుప్తంగా

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న ఎస్‌ఐ ముకుందరావు

ఇచ్ఛాపురం టౌన్: పట్టణంలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పట్టణ ఎస్‌ఐ ముకుందరావు తెలిపారు. గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాత్రివేళల్లో గస్తీ పెంచామని, తాను కూడా స్వయంగా పరిశీలిస్తున్నానని పేర్కొన్నారు. ట్రిపుల్ డ్రైవింగ్, లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు క్రాల్ గ్లోబల్ సొల్యూషన్స్ ఎల్‌ఎల్‌పీ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. సీఎస్‌ఈ, ఐటీ, ఈసీఈ, సీఎస్‌ఎం తదితర విభాగాలకు చెందిన 8 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఆయా విద్యార్థులు ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.5 లక్షల వేతనాలు అందజేస్తారని వెల్లడించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌వోడీలు ఎం.ఎస్.సంతోష్‌కుమార్ తదితరులు అభినందించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ


నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస మండలం కేదారిపురం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు కొల్లి ఫాల్గుణరావు నలుగురు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు గురువారం పంపిణీ చేశారు. ప్రతీ ఉగాది పండుగను పురస్కరించుకుని నిరుపేదలు, ఒంటరి వృద్ధులను గుర్తించి ఆర్థిక సాయంతో పాటు నెలరోజులకు సరిపడే నిత్యావసరాలు అందజేస్తుంటారు.

ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు

ఇచ్ఛాపురం రూరల్: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లోని దేవాలయాలు, ప్రార్థనా స్థలాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని రూరల్ ఎస్‌ఐ ఇ.శ్రీనివాస్ తెలియజేశారు. మండలంలోని తేలుకుంచి, బొడ్డబడ, హరిపురం గ్రామాల్లో సీసీ కెమెరాలు గురువారం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ముందుకొచ్చి, ఆయా దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఆక్రమణలను అరికట్టాలి


పార్కును పరిశీలిస్తున్న డాక్టర్ జీవితేశ్వరరావు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఉన్నటువంటి ముత్యాలమ్మ కోనేరులో ఆక్రమణలు అరికట్టాలని డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు కోరారు. గురువారం పార్కును ఆయన సందర్శించి విలేకరులతో మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇక్కడ నెహ్రూ పార్క్‌గా నామకరణం చేసి ప్రారంభించారని గుర్తు చేశారు. కనీసం ముళ్ల కంచెను ఏర్పాటు, గ్రీనరీ డవలప్‌మెంట్, వాచ్‌మెన్ నియమాకం వంటివి చేపట్టాలని విన్నవించారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


రోడ్డుకు అడ్డంగా పడిపోయిన విద్యుత్ స్తంభం

టెక్కలి రూరల్: టెక్కలి-నౌపడ రోడ్డులోని రావివలస జంక్షన్ వద్ద గురువారం రాత్రి పోర్టు వాహనం ఢీకొని విద్యుత్ స్తంభం విరిగి రహదారికి అడ్డంగా పడిపోయింది. దీంతో విద్యుత్ వైర్లు తెగి కింద పడిపోవడంతో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న వాహనదారులు తెగిన విద్యుత్ వైర్లను గమనించి తమ వాహనాలు అదుపుచేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఒకవేళ తెగిన విద్యుత్ వైర్లను గుర్తించక వాహనదారులు వచ్చి ఉంటే పెను ప్రమాదం జరిగేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో విద్యుత్ శాఖాధికారులు హుటాహుటిన విద్యుత్ సరఫరాను అదుపు చేశారు.

కనిపించని సౌర వెలుగులు


ఇచ్ఛాపురంలో ఏర్పాటు చేసిన సోలార్ పలకలు

- సూర్యఘర్ పథకంపై నిరాసక్తత
- రాయితీ ఉన్నా వినియోగించుకోని వైనం
- ఇచ్ఛాపురంలో 500 దరఖాస్తులు
- 74 యూనిట్లే ఏర్పాటు

ఇచ్ఛాపురం రూరల్:

కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకానికి ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అంతంతమాత్రంగానే స్పందన కనిపిస్తోంది. సౌర ఫలకాల ఏర్పాటు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. మార్చి నాటికి నియోజకవర్గంలో ఆరు వందల యూనిట్లను ఏర్పాటు చేయించాలన్నది లక్ష్యం కాగా, ఇప్పటివరకు 500 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 74 మంది మాత్రమే డబ్బులు చెల్లించినట్లుగా సంబంధిత అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో విద్యుత్ సరఫరాను దృష్టిలో పెట్టుకొని సోలార్ యూనిట్ల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సాహిస్తోంది. సొంత ఇంటిపై సౌర ఫలకాల ఏర్పాటుతో సొంతంగా విద్యుత్ ఉత్పత్తిని చేసుకోవచ్చు. మిగులు విద్యుత్‌ను శాఖా పరంగా కొనుగోలు చేసి బిల్లులో సర్దుబాటు చేయనున్నారు. ఒకేసారి పెట్టుబడి పెడితే కరెంటు బిల్లు జోలికి పోవాల్సిన అవసరం ఉండదు.

ఆసక్తి చూపని ప్రజలు

సౌర విద్యుత్‌కు ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. అయితే రుణాలకు బ్యాంకర్లు మొండిచేయి చూపడంతో వినియోగదారులు ఆసక్తి చూపడం లేదు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా వీటిని ఏర్పాటు చేస్తుండటంతో భవిష్యత్తులో బీసీలకు కూడా ఈ ఉచిత పథకం వర్తింపజేస్తారన్న నమ్మకంతో కొంతమంది ఉన్నారు.

ఆదాయం పొందవచ్చు

మొత్తం విద్యుత్ వినియోగం ఆధారంగా 120 యూనిట్లలోపు ఉన్నవారికి 1 కిలోవాట్ అవసరమవుతుంది, దీనికి రూ.30,000 రాయితీని అందిస్తున్నారు. 240 యూనిట్లు నెలకు వాడుకునే వారికి 2 కిలోవాట్లు అవసరం కాగా, రూ.60,000 రాయితీ ఇస్తున్నారు. 360 యూనిట్లు వినియోగిస్తున్నవారికి 3 కిలోవాట్లు అవసరమవుతుంది. వీటికి రూ.78,000 రాయితీ ఇస్తున్నారు. దాదాపు రూ.2 లక్షలు విలువైన 3 కిలోవాట్లు సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.78 వేల రాయితీ కల్పించింది. రూ.20 వేలు లబ్ధిదారుడి వాటా పోనూ, మిగిలిన మొత్తాన్ని 7 శాతం తక్కువ వడ్డీతో బ్యాంకు రుణం పొందవచ్చు. ఈ వ్యవస్థ ద్వారా ఏడాదికి దాదాపు రూ.32 వేలు ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వినియోగించుకున్న తర్వాత మిగిలిన సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా యూనిట్‌కు రూ.2.09 ఆదాయం పొందవచ్చు. రుణం పొందేందుకు బ్యాంకులకు సెక్యూరిటీ కింద ఎటువంటి డాక్యూమెంట్లు సమర్పించాల్సిన అవసరం లేదు.

అపోహలు వద్దు

సోలార్ పవర్ వల్ల విద్యుత్ బిల్లు భారీగా తగ్గుతుంది. మొదట పెట్టుబడి ఎక్కువగా అనిపించినప్పటికీ భవిష్యత్తులో ఊహించని ప్రయోజనం చేకూరుతుంది. సోలార్ రూఫ్ టాప్ విషయంలో ఎటువంటి అపోహాలు అవసరం లేదు. బ్యాంకులు రుణంగా ఇస్తాయి. బ్యాంకు అప్పు తీరిపోతే 15 సంవత్సరాల పాటు ఇంటికి ఉచితంగా విద్యుత్ పొందడంతో పాటు మరికొంత సొమ్ము ఎస్పీడీసీఎల్ నుంచి వస్తుంది.

– ఎం.రవికుమార్, ఏడీ, ట్రాన్స్‌కో, సోంపేట

ఎక్కడా ప్రచారం లేదు



కేంద్ర ప్రభుత్వం సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా అందిస్తుందని జిల్లా కలెక్టర్ చెప్పినప్పటికీ అధికారులు కనీసం ఈ విషయాన్ని ఎక్కడా ప్రచారం చేయడం లేదు. అంతేకాదు మిగతా బీసీ, ఓసీలకు కూడా ఈ పథకం గూర్చి గ్రామాల్లో ప్రచారం తక్కువగా ఉందని తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలి.

– సల్ల దేవరాజు, అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ సేవా సంఘం, ఇచ్ఛాపురం నియోజకవర్గం

భూముల రీసర్వే



పలాస మండలంలోని కిషపురం గ్రామంలో భూముల రీసర్వే కార్యక్రమాన్ని మరోసారి పలాస ఆర్డీవో జి.వెంకటేష్ గురువారం ప్రారంభించారు. గ్రామాల్లోని సర్వే బృందానికి భూ యజమానులు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భూముల రీసర్వే వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌డీటీ వాయిలపల్లి సునంద, మండల సర్వేయర్ గిరి, రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. – పలాస

ప్రభుత్వ బడుల్లో చేర్పించండి



బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబులు కోరారు. ఈ మేరకు మండలంలోని ఎస్‌ఆర్‌సీపురం పాఠశాల పరిధి గ్రామంలో గురువారం క్యాంపెయినింగ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ బడుల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, ఉచిత పథకాలు, భోజన సౌకర్యం తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ముకుందరావు, లక్ష్మణరావు, సీఆర్‌ఎంటీయూలు ఎస్.శ్రీలక్ష్మి, టి.ఢిల్లీరావు, బిడి జగన్నాథం పాల్గొన్నారు. – కంచిలి

ఈకేవైసీ కష్టాలు



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కేటీరోడ్డులో ఉన్నటువంటి బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద ఆధార్ నమోదు కేంద్రంలో ఈకేవైసీ నమోదుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో కార్డుదారులంతా ఆరుబయట ఎండలో వేచి ఉంటూ పాట్లు పడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు సైతం ఎండలోనే ఉంటున్నారు. దీంతో ఈకేవైసీని ప్రభుత్వం సులభతరం చేయాలని కోరుతున్నారు. – కాశీబుగ్గ

బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు



ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో పలుచోట్ల బీసీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు గురువారం నిర్వహించారు. ఆయా మండలాల ఎంపీడీవోల ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలించి, బ్యాంకు అధికారులకు తెలియజేశారు. ఎంపికైనవారి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో అభ్యర్థులు పాల్గొన్నారు. అయితే పలుచోట్ల టీడీపీ నాయకులు హడావుడి చేయడంతో పలువురు బహిరంగంగానే విమర్శించారు. – సాక్షి నెట్‌వర్క్

పరామర్శ


రత్నాలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం మాజీ ఎంపీటీసీ సభ్యురాలు గయా రత్నాలు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. దీంతో విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆమె కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానంద రెడ్డి, సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్ యాదవ్, నీలాపు సారథిరెడ్డి, కారంగి త్రినాథ్, సాడి గురుమూర్తి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, వైస్ సర్పంచ్ మురా బెహరా, నర్తు భానోజీరావు, మోహన్ బెహరా, బొనమాలి బెహరా తదితరులు పాల్గొన్నారు.

రెండు ఈతచెట్లు దగ్ధం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మెయిన్ రోడ్డులోని పి.రాంబాబుకు చెందిన రెండు ఈతచెట్లు గురువారం మధ్యాహ్నం దగ్ధమయ్యాయి. ఖాళీ స్థలంలో పారిశుద్ధ్యం నిర్వహించి ఆ చెత్తను సమీపంలో ఉన్న ఈత చెట్ల దగ్గరలో నిప్పుపెట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. చెత్తకు నిప్పు అంటించినవారు ఇంటికి వెళ్లిపోయిన కొంత సమయానికి ఈతచెట్లు మెల్లగా అంటుకుని ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

పలాసలోనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇవ్వాలి


కాశీబుగ్గ: ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న ఆటో డ్రైవర్లు

కాశీబుగ్గ: పలాస ఆర్టీవో కార్యాలయంలోనే ఆటోలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందజేయాలని పలాస పీపీసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. ఇదివరకు పలాసలోనే ఆటో ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ మంజూరు చేసేవారని తెలిపారు. కానీ ఇటీవల ఎచ్చెర్లలోని సెంటర్‌కు వెళ్లేందుకు ఆటో డ్రైవర్లు నానా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఎప్పటిలాగే పలాసలో ఉన్న ఎంవీఐ కార్యాలయంలోనే సర్టిఫికెట్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కాశీబుగ్గ: ఆటో ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నామని, ఈ సమస్యను పరిష్కరించాలని ఆటో కార్మికులు కోరారు. ఈ మేరకు ఆటో యూనియన్ల గౌరవాధ్యక్షుడు, టీడీపీ నాయకుడు దువ్వాడ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులంతా ఎమ్మెల్యే శిరీషను ఆమె కార్యాలయంలో గురువారం కలిశారు. ప్రస్తుతం ఆటో ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలంటే ఎచ్చెర్ల వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఇచ్ఛాపురం రూరల్: విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో మండలంలోని రత్తకన్న, మండపల్లి, ఎం.తోటూరు, బాలకృష్ణాపురం, బుడ్డేపుపేట గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని ఈఈ జి.ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని పలాస విద్యుత్ శాఖ ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్, లైన్లు ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పూండి, పీఎంపురం, అమలపాడు, కేఆర్‌పేట పాతటెక్కలి, కొత్తపేట, దేవునల్తాడ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

ఉన్నత లక్ష్యాలు అలవర్చుకోవాలి


సోంపేట: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామారావు


కవిటి: విద్యార్థుల నృత్య ప్రదర్శన

సోంపేట: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు అలవర్చుకోవాలని బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి. రామారావు ఆకాంక్షించారు. కళాశాల వార్షికోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కవిటి: తల్లిదండ్రుల ఆశయ సాధనకు విద్యార్థులు కృషి చేయాలని ఎంఈఓ ధనుంజయ మజ్జి, హెచ్‌ఎం సనపల రామకృష్ణ సూచించారు. మండలంలోని బొరివంక ఉన్నత పాఠశాల ఫేర్వెల్ డే వేడుకలు పాఠశాలలో గురువారం నిర్వహించారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో డిజిటల్ పోస్టల్ సేవలు


తనిఖీలు చేపడుతున్న జిల్లా పోస్టల్ అధికారి హరిబాబు

ఇచ్ఛాపురం: ప్రతి ఒక్కరికీ డిజిటల్ పోస్టల్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని శ్రీకాకుళం జిల్లా పోస్టల్ అధికారి ఎస్‌పీవో వి.హరిబాబు అన్నారు. స్థానిక సబ్ పోస్టాఫీస్‌లో జిల్లా పోస్టల్ అధికారి అధ్వర్యంలో వార్షిక తనిఖీలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ సేవల్లో భాగంగా పోస్టాఫీసులకు రాకుండా పోస్టల్ ఏటీఎం కార్డుల ద్వారా నేరుగా ఇంటివద్ద నుంచే ఖాతాల్లో ఆన్‌లైన్ ద్వారా జమ చేసుకోవడం, విత్‌డ్రా చేసుకోవడం చేసుకోవచ్చన్నారు. గతేడాది జిల్లావ్యాప్తంగా లక్షా డబ్బైవేల కొత్త ఖాతాలను తెరవడం జరిగిందన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా స్థానిక పోస్టాఫీస్‌లో ఖాతాదారులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. స్థానిక పోస్టాఫీస్‌లో పోస్టల్ బుకింగ్‌లు పెంచాలని, కొత్త ఖాతాదారుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని, సుకన్య సమృద్ధి యోజనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్టల్ సోంపేట సబ్‌డివిజన్ శ్రీకాంత్, స్థానిక పోస్టుమాస్టర్ జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పరిశీలన

కంచిలి: మండలంలోని పెద్ద సాగునీటి వనరులను జిల్లా ఇరిగేషన్ అధికారుల బృందం గురువారం పరిశీలించింది. మండలంలోని కుంబరినౌగాం పంచాయతీ పరిధిలో సుంకిలి సాగరం, డోలగోవిందపురంలో గోవింద సాగరం, బెల్లుపడ గ్రామంలో హెత్తా చెరువు కుంచాగాయి చానెల్, ఎక్కల గ్రామంలోని ఊర చెరువు, కేసరపడ వద్ద రాకాసిగెడ్డ తదితర సాగునీటి చెరువులను ఇరిగేషన్ ఎస్‌ఈ తిరుపతిరావు తదితరులు పరిశీలించారు. ఈ చెరువు పరిధిలో ఆయకట్టు రైతులతో మాట్లాడారు. పర్యటనలో ఇరిగేషన్ అధికారులతోపాటు నియోజకవర్గ రైతులు, వంశధార జలసాధన కమిటీ సభ్యులు డాక్టర్ శివాజీ, మాదిన రామారావు, దేశెట్టి దాలిబంధు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు అధికారులు సమాధానమివ్వాలి

- ఎమ్మెల్సీ నర్తు రామారావు
- సజావుగా సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

సోంపేట: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాల్లో ప్రజాప్రతినిధుల ఫిర్యాదులకు అధికారులు లిఖిత పూర్వకంగా సమాధానమివ్వాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. స్థానిక మండలం పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను సభ దృష్టికి తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలుపై శాసన మండలిలో ప్రస్తావించడం ద్వారా, ధాన్యం కొనుగోలు సమస్య నియోజకవర్గంలో పరిష్కారమైందని పేర్కొన్నారు.

ప్రోటోకాల్ పాటించాలి

ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో అధికారులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు గౌరవం ఇవ్వడం లేదని, ప్రోటోకాల్ విస్మరించడం మంచి పద్ధతి కాదని స్పష్టం చేశారు. పలాసపురం సర్పంచ్ తడక జోగారావు మాట్లాడుతూ పైడిగాం కాలువ ఆక్రమణలు తొలగించాలని కోరారు. పలాసపురం గ్రామంలోని సింధుపట్టపురాణి అమ్మవారి ఆస్తులు సుమారు 5 ఎకరాలు, రట్టి వల్లభనారాయణుని ఆస్తులు 9 ఎకరాల భూముల్లో గ్రామానికి చెందిన పలువురు పట్టాలు చేయించుకున్నారని, దీనిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. సోంపేట పట్టణంలోని బిరుసువాడ కాలనీలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కల్యాణ మండపంపై చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ గురాల శ్రీను, బేసి రామచంద్రాపురం సర్పంచ్ బుద్దాన రోహిణి మాట్లాడుతూ ఉపాధి హామీ వేతనదారులకు సగటు వేతనం రావడం లేదని ఆరోపించారు. రాజకీయ కక్షలతో కొర్లాం, బారువ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం దారుణమన్నారు. తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉప్పలాం సర్పంచ్ బట్టి మాధవరావు మాట్లాడుతూ మత్స్యకార భరోసా అందజేయాలని అధికారులను కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ తడక యశోద, వైస్ ఎంపీపీ రేగు ప్రేమ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల రెండోరోజు నిరసన


టెక్కలి: ధర్నా చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగులు


పలాస: నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

పలాస: పలాస ఆర్టీసీ కార్మికులు రెండో రోజు గురువారం ఆర్టీసీ మెయిన్ గేటు వద్ద తమ నిరసన తెలియజేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా 1/19 సర్క్యులర్ అమలు చేయాలని ఎస్‌ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డీఎల్ నారాయణ, పి.వాలి, ఎన్.శ్రీను, డి.రమేష్, డి.ఎస్.రావు, ఎ.వి రావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: పలాస ఆర్టీసీ డిపోలో కండక్టర్ నీలకంఠంపై అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం టెక్కలి డిపో ఎదురుగా ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగులు నిరసన తెలిపారు. యూనియన్ కార్యదర్శి ఎస్.మోహన్‌రావు నేతృత్వంలో మధ్యాహ్న భోజన సమయంలో డిపో ఎదురుగా ఎర్ర బ్యాడ్జీలు ధరించి ధర్నా చేపట్టారు. తక్షణమే సస్పెన్షన్ రద్దు చేయాలని, ఇటీవల ట్రాఫిక్ సిబ్బందిపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో బి.మురళి, ఎస్.వి.రమణ, కె.కృష్ణ, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారస్తులకు రక్షణ కల్పించండి


వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారస్తులు

మందస: వ్యాపారస్తులకు ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అధికారుల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని మందస వర్తక సంఘం అధ్యక్షుడు వడ్డీ గోపాలకృష్ణ కోరారు. ఈ మేరకు వర్తక సంఘం సభ్యులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ కె.రామకృష్ణకు వినతిపత్రం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని కిరాణా షాపుల్లో ఎటువంటి నిషేధిత పదార్థాలు అమ్మడం లేదని స్పష్టం చేశారు. కానీ ఎక్సైజ్ పోలీసులు తరుచూ స్టేషన్లకు పిలిపించి నల్లబెల్లం అమ్ముతున్నామని బైండోవర్ కేసులు పెడతామని హెచ్చరిస్తున్నారని వాపోయారు. అధికారులు వ్యాపారస్తులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎం.ధర్మారావు, కె.మహేష్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.